International Journal of Enhanced Research in Educational Development (IJERED)
ISSN: 2320-8708, Vol. 13 Issue 6, November-December, 2025

# తెలంగాణ సాహితీ శిఖరం 'అందెశ్రీ' – అశు కవిత్వం పరిశీలన

**Vittam Dhanamjaya**

Lecturer in Telugu Govt Degree College, Bodhan Nizamabad Dist., Telangana State.

---

**ఉపోద్ఘాతం**

ఆది నుంచి తెలంగాణప్రజలను ముందుకు నడిపించడంలో, చైతన్య పరచడంలో సాహిత్యానిదీ కీలక పాత్ర. సూటిగా మనసులను తాకేలా, ఆలోచింపజేసే రీతిలో ఎందరో కవులు తమ రచనలు ద్వారా సమాజాన్ని జాగృతం చేయగలిగారు. తెలంగాణ ఉద్యమ పతాకాన్ని రెపరెపలాడించిన గొప్పకవులలో అందె శ్రీ ఒకరు. ప్రజాకవిగా, ప్రకృతి కవిగా సుప్రసిద్ధులైన అందెశ్రీ, జనగాం దగ్గరలోని రేబర్తి అనే గ్రామంలో 1961 జులై 18 న జన్మించారు. ఆయన అసలు పేరు అందె ఎల్లయ్య. తెలుగు భాష, సాహిత్యంపై అందెశ్రీ కి ఉన్న ప్రేమతో పాటు, తన ప్రత్యేకమైన శైలి, ఆయన్ను ప్రజాకవిగా నిలబెట్టింది. గొర్రెల కాపరిగా మొదలైన ఆయన ప్రయాణం ఎన్నో పురస్కారాలతో పాటు డాక్టరేట్ వరకు చేర్చింది. సాహిత్యంలో వశీకరణ శక్తిని నింపుకొన్న ప్రక్రియ పాట. రాతి హృదయాల్లోనూ చివుళ్లను మొలిపించగల స్పర్శ పాటలో దాగుంది. అది భూప్రకంపనలను మించిన స్పందనల్ని సృష్టిస్తుంది. అందెశ్రీ అటువంటి పాటల సృష్టికర్త. ఈ వ్యాసం ద్వారా తెలంగాణ ప్రజాకవి అందెశ్రీ అశు కవిత్వాన్ని, పాటలను, సినీ గేయాలను ముఖ్యంగా 'మాయమై పోతున్నడమ్మ మనిషన్న వాడు'' తెలంగాణ రాష్ట్ర గీతం “ జయ జయహే తెలంగాణ” వంటి సాహిత్యాన్ని సవివరంగా వివరించడం ఈ పత్ర లక్ష్యం.

కీలకపదాలు: ప్రజాకవి, తెలంగాణ, అశుకవిత్వం , పాటలు

పరిచయం: తెలంగాణ నేల అద్భుతమైన గనులు, మణులు, మాణిక్యాలు ఎన్నో సహజ వనరులను తన గర్భములో నిక్షిప్తం చేసుకుని ఉంటుంది. అడవులు, నదీనదాలు, ఎడారులు, కొండలు, గుట్టలు, అగ్ని పర్వతాలను తన ఎద మీద రక్షణగా నిలుపుకుంటుంది. అలాంటి అగ్ని పర్వతాలలో నడిచే ఆగ్నిపర్వతం అందెశ్రీ. సమస్త లోకాన్ని సైనికుడై చుడుతూ కవిత్వ కవాతు చేస్తున్నవాడు. అగ్ని పర్వతం చూడడానికి బుద్ధిగా, ఒద్దికగా అనిపించినా కాలక్రమ ధ్వంసం, కాల గర్భిత హింసను భరించి, భరించి కడకు సహించలేక బద్ధలవుతుంది. అందెశ్రీ పాట, కవిత్వం కూడా అంతే.

పల్లె ఊసునూ, ప్రకృతి ఆత్మను, మనిషి స్థితిగతినీ అక్షరాలుగా పేర్చి, కవిత్వంగా మలిచిన శిల్పి అందెశ్రీ. అందెశ్రీ పాఠశాలకు వెళ్లి పుస్తక పాఠాలు నేర్చుకోలేదు .ప్రకృతి ఒడిలో జీవిత పాఠాలు నేర్చుకున్నారు. ఆ పాఠాలనే పాటలుగా మలిచి కోట్లాది ప్రజల హృదయాలలో చెరగని స్థానాన్ని సంపాదించుకున్నారు. చే కలం అయ్యారు. గొర్ల కాపరిగా, భవన కార్మికుడిగా పని చేసిన అందెశ్రీ, సామాన్యుల కష్టాన్ని వినిపించే కలం అయ్యారు. తెలంగాణ గురించి, ప్రకృతి గురించి, ప్రజల గురించి ఎన్నో గొప్ప పాటలు రచించారు. పాల బుగ్గల జీతగాడుగా ఉన్న కాలంనుంచే ఆయన మెదడును ప్రజా ఉద్యమ గాలి ఆవహించింది. తనకు తెలియకుండానే ఉద్యమాలను చదువుకున్నడు, ఆకళింపు చేసుకున్నడు. ఏనాడూ కన్న ప్రేమకు, కలం ప్రేమకు నోచుకున్నోడు కాదు. ఆ బాధలు మర్చిపోవడానికి, పద్య శరణుజొచ్చాడు అందెశ్రీ.

ఏనాడూ బడి మొఖం చూడని సామాన్యుడు ఇవాళ అందరి బాధలు తీర్చేందుకు పాట ఆయుధాన్ని భుజానికెత్తుకొని ధైర్యంగా కైతల కవాతు చేస్తున్నాడు. ప్రజలను పందిరిగా చేసుకొని, పాటను పరాకాష్టగా నిలబెట్టడం కోసం తపిస్తున్నాడు. బహుశా పోతన పుట్టిన నేలమీద పుట్టినందున కావచ్చు అందెశ్రీ 'రాజ్యాలకు, రాజులకు, రాజ్య ప్రాకారాలకు పాటను తాకట్టు పెట్టనని' శపథం తీసుకున్నాడు. నేటి పాటల పరాయీకరణ యుగంలో అందెశ్రీ ప్రజలకు తప్ప దేనికీ, ఎవరికీ తలవంచనని ప్రకటించడం అత్యంత సాహసమే కాదు! సమరపు ధైర్యం కూడా.
ప్రకృతి పాఠశాలలో పాటను దిద్దుకున్న సహజకవి అందెశ్రీ పరిసరాల్లోని పరిణామాలకు పాటగా పరిఢవిల్లిన ప్రజాకవి ఆయన. పసితనం నుంచే పశువుల కాపరిగా పనిచేసినా, రోజువారీ కూలీగా, తాపీ

**మేస్త్రీగా శ్రమించినా మనసు మాత్రం పదాల చుట్టూ పరిభ్రమించేది. ఊహ తెలియని వయసులో తల్లిదండ్రుల ప్రేమకు దూరమై అనాథైన ఆయనకు పాట తొలి ఊరటనిచ్చింది. ఏ బడిలో చదువుకోకపోయినా లోకమనే విశ్వవిద్యాలయంలో గాఢమైన తాత్విక విషయాలను అవగాహన చేసుకున్నారు. తొలిదశలో శృంగేరి మఠ పీఠాచార్యులు స్వామి శంకర్ మహరాజ్ ఆశీస్సులతో జీవనోత్సాహాన్ని నింపుకొన్నారు. ఆచార్య బిరుదురాజు రామరాజు ప్రేమాభిమానాలు పొంది ఆయన మార్గదర్శకత్వంలో సాహిత్య సృజనకు పాదులు తవ్వుకున్నారు.**

**అందెశ్రీ పాట మాత్రం నిజామాబాద్లో పురుడుపోసుకుంది....**
వరంగల్ జిల్లాలో పుట్టిన అందెశ్రీ పాట మాత్రం నిజామాబాద్ లో ఉండగా పురుడుపోసుకుంది. కొత్తపాట కోసం తపన. నిరంతరం వెదుకులాట. ఆ కాలంలోనే ఉద్యమాలతో చుట్టరికం కలిసింది. పొద్దంతా మేస్త్రీపని. రాత్రంతా సభలు, సమావేశాల్లో పాటలు వినే పని. తొమ్మిదేళ్ళు అవిశ్రాంతంగా పని.. పని... ఉద్యమాలు నాలాంటి కష్టజీవుల కోసమే కదా. అందులో పనే. అక్కడా లెక్కలేనంత పనే. పనిచేయని వాళ్ళు అక్కడ అదలిస్తారు.

బెత్తం పట్టుకున్నట్లు కనబడింది వాళ్ళ స్వభావం నాకు అంటాడు. ఈ సమయంలోనే నన్నయ నుండి గద్దర్ వరకు సాహిత్య అన్వేషణ ఆరంభించాడు. యెల్లండ కేంద్రంగా ఒక జన సంఘం వచ్చింది. ఇది వాళ్ళ ఊరికి రెండు మైళ్ళ దూరంలో ఉన్న బైరాన్పల్లినాటి తెలంగాణా రైతాంగ పోరాట కాలంనాటి సంఘం కాదు. ఇది కొత్త పాటల జాతర. కాముని పున్నమినాడు ఊరి అడుగుభాగాన పదిమందితో కలిసి పాడినపాట. '**ఊరు మనదిరో**) **వాడ మనదిరో**/**దొర ఏందిరో**/**దొరతనం ఏందిరో**' పాట పాటకాదు. అది ఊరిలోని తొంబై శాతం ప్రజల మనోద్వేగ సామూహిక నినాదం. బతుకు అతని ముందు జలపాతాన్ని నిలిపింది. దాన్ని దాటి ప్రయాణించాలి. పాట రాస్తే కొత్తగా ఉండాలి.

**పాడితే కంఠనాళం తెగి పడాలి....**
పల్లవితో అంటుకునే అగ్ని కావాలి. అంతిమ చరణం శ్రోతల్లో బడబాగ్ని పుట్టించాలి. ఆనాటి కవిత్వయుగంలో కనిపించేవన్నీ కొండ కోనలపై మెరిసే మరఫిరంగులే. అలాంటి కవుల కన్నా భిన్నంగా రాయడం ఎలా? మేస్త్రీగా ఉన్నప్పుడు చదువుకున్న విజ్ఞులు నేస్తాలయ్యారు. ఎన్నటికీ మరువరాని పెద్దలెందరో ఉన్నారు. అందరూ అతని కవిత్వ ఇంద్రధనువుకి ఏడురంగులు అద్దారు. ముఖ్యంగా తెలుగు విశ్వవిద్యాలయం విద్యార్థులు అలసి సొలసివస్తే తాము తినే అన్నాన్ని పెట్టారు. తాము తాగే నీళ్ళిచ్చారు. పడుకునే ఇరుకు మంచంపై కాస్తంత చోటిచ్చారు. అపుడు ఆకలి తీరింది కాబట్టే పాటలపై దృష్టి మరలింది. 'పాటలపూదేట'లో గేయాలు, 'అందెల సందడిల'లో వచన కవిత్వం ఉంది. అయినా అతనిలో అసంతృప్తి. అప్పుడు ఆలోచనలు రేపిన కలాలు ఉన్నాయి.

ప్రోత్సాహం నింపిన నేస్తాలు ఉన్నారు. అభయహస్తం ఇచ్చినవారు, పాటల జనజాతరలు ఎన్నెన్నో దాగి ఉన్నాయి. తెలుగు విశ్వవిద్యాలయం అచార్యుల సహవాసంతో పాట కోసం పరిశోధన చేపట్టాడు. పరిశోధించి పాటని సిద్ధాంతవ్యాసం చేశాడు. పాట, పరిశోధన పని కలిపి తాత్విక చింతనగా మార్చాడు. జనహిత మార్గంలో పాటల్ని తన వంతు కార్యకర్తలుగా చేశాడు. వందల కొద్దీ పాటలు రాయాలని కాదు. ఒక చరణం వేలాది ప్రజల చిరునామా కావాలన్నదే అతని ధ్యేయం, తాను జన్మించిన నేల, తన ప్రజలు, తన సాహిత్య కళారంగంపట్ల తనదైన బాధ్యత ఉందని నమ్మే విలక్షణ కవి అందెశ్రీ. అనువాదం చేస్తే ఆదికవి అనవచ్చు. కాని అనుకరణ చేసే ఏలాంటి కవినైనా ప్రజలు తిరస్కరిస్తారు అంటాడు. జానపదాలను తక్కువగా చూసి అది తప్పని తెలుసుకున్నాడు. ఆ ప్రజల పాటలే తన పాటలకింత ఔన్నత్యం కలిగించాయని అంటాడు.

**పసుల కాసే పిల్లగాడికి దత్తపీఠం, గౌరవం, స్వర్ణకంకణం పురస్కారం...**
పసుల కాసే పిల్లగాడికి ఏ భీమ్ సేన్ జోషికి, మంగళం పల్లికి, ఎమ్మెస్ సుబ్బులక్ష్మికి దక్కని దత్తపీఠం, గౌరవం, స్వర్ణకంకణం, లక్ష రూపాయల సత్కారం అందెశ్రీకి దక్కిందంటే ప్రజల పాటలకున్న శక్తి అని ఆయన అభిప్రాయపడతాడు. మార్గనుండి లలిత, దేశీ నుండి జనం బాణీల్లోకి చేసిన యాత్రలో అతను ఆస్తికుడూ కాదు నాస్తికుడూ కాదు. అతని పాటలు ఏవ ఇలాంటి ఏ భావజాలాన్ని సమర్థించవు. నిజానికి నాకు దైవం మీద నమ్మకం కన్నా ప్రకృతిమీద గౌరవం అధికం. కనుపించని దైవభావన కన్నా ముందున్న మట్టిమానవుల సాహిత్యానికీ, వారి మాండలిక భాషకు - వీటికి మూలమైన పల్లెకే వినమ్రంగా దండం పెడతా నంటాడు.


- '**ఈ లోకం నీ ఇల్లు జనమంతా నా వాళ్ళు**' అని ప్రకటించిన అందె శ్రీ.

**అనేకానేక పాటలు**
**ఇలాంటి మచ్చు తునకలను చూసే కాబోలు 'ఇక్కడి మనుషులు మనుషులుగానే జీవిస్తున్నారు' అంటాడు ప్రసిద్ధ చరిత్రకారుడు జయధీర్ తిరుమలరావు. ప్రతి ఇంటిలో పటంగట్టి గోడలకు తగిలించాల్సిన ఎన్నో**

International Journal of Enhanced Research in Educational Development (IJERED)
ISSN: 2320-8708, Vol. 13 Issue 6, November-December, 2025

పాటలు రాశాడు అందెశ్రీ. 'కొమ్మ చెక్కితె బొమ్మరా, కొలిసి మొక్కితే అమ్మరా' అని మానవజాతి తొలి జీవన గమనాన్ని వివరిస్తాడు. జానపదుల జీవిక, గ్రామ దేవతల భూమికను చిత్రికపడతాడు. ప్రపంచీకరణ యుగంలో మాయమైపోతున్న మనిషిని వెతుకుతాడు. భక్తి పేరుతో జరుగుతున్న వ్యాపారాన్ని, ఆధ్యాత్మికత పేరుతో చేస్తున్న మతోన్మాద దుర్మార్గాలను ఖండిస్తాడు.

ఆత్మవిమర్శకు పురిగొల్పే పాట.
సహజకవి అందెశ్రీ. మట్టి వాసనలో నుంచి అక్షరాలను పుట్టించిన ప్రజా కవి ఆయన. మాయమైపోతున్నడమ్మో.. పాటతో మనసున్న మనుషుల కోసం వెతికాడు. మనుషులతో కిక్కిరిసిపోయిన ఈ ప్రపంచంలో ఒకే ఒక్క మంచి మనిషి కోసం ఎంతగానో తపించిపోయాడు. మనిషిలోని మానవత్వం కోసం ఆవేదనతో మాయమైపోతున్నడమ్మో పాట రాశాడు అందెశ్రీ.



అందెశ్రీ
పల్లవి: మాయమైపోతున్నడమ్మో
మనిషన్నవాడు ఓ....ఓ....ఓ....
మచ్చుకైనా లేడు చూడూ
మానవత్వం వున్నవాడూ
నూటికో కోటికో ఒక్కడే ఒక్కడు
యాడవున్నాడో కాని కంటికీ కనరాడు !! మాయమై !!
చరణం: నిలువెత్తుస్వార్థము నీడలాగొస్తుంటే
చెడిపోకఏమైతడమ్మో
ఆత్మీయ బంధాల ప్రేమ సంబంధాల
దిగజారు తున్నడోయమ్మో
అవినీతి పెను ఆశ అంధకారములోన
చిక్కిపోయి రోజు శిధిలమౌతున్నాడు !! మాయమై !!
చరణం: కుక్కనక్కల దైవరూపాలుగా కొలిసి
పంది నందిని జూస్తే పడి మొక్కుతుంటాడు
చీమలకు చక్కెర పాములకు పాలోసీ
జీవకారుణ్యమే జీవితము అంటాడు
తోడబుట్టిన వాళ్ల ఊరవతలికి నెట్టి
కులమంటు ఇల మీద కలహాల గిరిగీసి !! మాయమై !!
చరణం: అధ్యాత్మికత కున్న అర్ధమె తెలియక
అంధుడై పోతున్నడమ్మో
హిందు ముస్లిం క్రీస్తు సిక్కుపార్శీ నంటూ
తనను తా మరిచేనోయమ్మో
మతము లోకహితము అన్న మాటా మరిచి
మత ఘర్షణల మధ్య మనిషి కనుమరుగౌతు !! మాయమై !!
చరణం: ఇరవై ఐదు పైసల గరు వత్తులు గాల్చి
అరవై ఐదు కోట్ల వరములడుగూతాడు
దైవాల పేరుతో చందాలకై దండ
భక్తి ముసుగూ తొడిగి భలె ఫోజు బెడతాడు
ముక్తి పేరా నరుడు రక్తిలో రాజయ్యి

రాకాసి రూపాన రంజిల్లుతున్నాడు !! మాయమై !!
చరణం: అవసరాలకు మనిషి సృష్టించిన రూపాయి
చుట్టూ దిరుగూతున్నడమ్మా
రూపాయి కొరకు ఏ పాపానికైతేమి
ఒడిగట్టే నదిగో చూడమ్మా
కోటి విద్యలు కూటి కోసమన్నది బోయి
కోట్లకూ పడుగెత్తా కోరికలు చెలరేగి !! మాయమై !!
చరణం: కండ్ల పొరలగమ్మి కామముతో ఊరేగి
వెకిలి చేష్టల తోటి వేధిస్తు వున్నాడు
కన్నవాళ్లకు రోజు కన్నీల్లె మిగిలించి
కౌగిలే స్వర్గమని కలలు గంటున్నాడు
చీకలైతె చాలు చిత్తుగా తాగేసి
వావి వరుసలు కాస్త మరిచి పోతూ నరుడు !! మాయమై !!
చరణం: పార్టీ సిద్ధాంతాల పరగణాలా
గొడవలోన పడి చస్తున్నడమ్మా
ఆధి పత్యపు పోరు అలజడె చిరునామ
అంటు జైకొడుతున్నడమ్మా
రాజకీయాలల్లో రాటు దేలి తుదకు
మానవతా విలువల్ని మంట గలుపుకుంట !! మాయమై !!
చరణం: ఇనుప రెక్కల డేగ విసిరినా పంజాకు
కోడిపిల్లై చిక్కికొట్టు కుంటున్నాడు
ఉట్టికి స్వర్గానికంద కుండగ తుదకు
అస్తి పంజరమయ్యి అగుపించనున్నాడు
కదిలె విశ్వం తనా కనుసన్నలో నడువా
కనుబొమ్మ లెగరేసి కాలగమనం లోనా !! మాయమై !!

'మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు/ మచ్చుకైనా లేడు చూడూ మానవత్వం వున్నవాడూ' అంటూ ఎండగడతాడు.

ఆధ్యాత్మికత అంటే బుద్ధుడిలా ఉండటమే తప్ప కుప్పిగంతులు, క్షుద్ర విద్యలు కావని బుగులు పడతాడు. 'కుక్కనక్కల దైవ రూపాలుగా కొలిసి / పంది నందిని జూస్తే పడి మొక్కుతుంటాడు/చీమలకు చక్కెర పాములకు పాలోసీ/ జీవకారుణ్యమే జీవితము అంటాడు/ తోడబుట్టిన వాళ్ల ఊరవతలికి నెట్టి/ కులమంటు ఇల మీద కలహాల గిరిగీసి' అంటూ జంతువులను మొక్కడం కాదు. మనుషలను మనుషులుగా చూడటం నేర్చుకోవాలని కోరుతుంటాడు. అవుల కోసం మనుషలను చంపుతున్న నేటి మత స్వామ్యం రాజ్యమేలుతున్న ఈ కాలంలో అందెశ్రీ పాట అత్యయిక అవసరం అనిపిస్తుంది. తన రేఖాచిత్రంలో సుద్దాల హనుమంతు లాంటివారు కనపడతారంటాడు.

ఆధునిక సమాజంలో తల్లిదండ్రుల పట్ల గౌరవం తగ్గిపోవడం, వ్యక్తికేంద్రీకరణ పెరిగిపోవడం, ప్రేమ మమకారాల క్షీణత వంటి వాటిని ఎత్తి పొడుస్తూ “జన్మనిచ్చిన తల్లిదండ్రులను వదిలేసి /యుగధర్మమిది యంటు జగమేలపోతారు/ అమ్మనాన్నలు కాస్త అన్నమడిగితే చాలు / కన్నపిల్లలే రోజు కళ్ళెర్ర జేస్తారు/ అరే... ముసలితనమది ముసిరి ఉసురుదీస్తూవుంటె/ పిసరంత దయలేక కసిరి చీ.. కొడుతారు” అంటూ తీవ్రమైన విమర్శతో చూపిస్తాడు. ఇక్కడ వాడిన భాషలోని కఠోరత, భావంలోని ఆవేదన, సమాజంపై ఉన్న బాధ్యత ఈ రచనకు ప్రాథమిక మూలస్థంభాలు. తల్లిదండ్రుల పట్ల మనిషి వ్యవహారం అతని నిజమైన విలువను నిర్ణయిస్తుందని అందెశ్రీ గట్టిగా చురక వేసినట్లుగా చెబుతాడు.

మతం మనిషి కోసం పుట్టింది, కానీ నేడు మనిషే మతం వల్ల కనుమరుగైపోతున్నాడంటూ “ఆధ్యాత్మికతకున్న అర్ధమె తెలియక అంధుడై పోతున్నడమ్మా హిందు ముస్లిం క్రీస్తు సిక్కు పార్శీనంటు తననుతా మరిచెనోయమ్మా మతము లోకాహితము అన్న మాట మరిచి మతఘర్షణల మధ్య మనిషి కనుమరుగౌతున్నాడంటూ ఘాటుగా ఉద్ఘాటిస్తాడు. ఇది ఒక ఆత్మపరిశీలనకు ఆహ్వానం, సమాజానికి ఒక హెచ్చరిక, మానవత్వానికి ఒక పునరుద్ఘాటన.

ఆధునిక సమాజపు భౌతికవాద పిచ్చిని, డబ్బు ఆధారిత జీవనాన్ని, విద్య యొక్క వాణిజ్య వక్రతను, మనిషి విలువల నాశనాన్ని తూర్పారబడుతూ "అవసరాలకు మనిషి సృష్టించిరూపాయి/ చుట్టూ దిరుగూతున్నడమ్మో /రూపాయి కొరకు ఏ పాపానికైతేమి /ఒడి గట్టె నదిగో చూడమ్మో/ కోటి విద్యలు కూటికోసమన్నవి బోయి/ కోట్లకూ పడిగెత్తా కోరికలు చెలరేగేనంటూ తీవ్రమైన భావోద్వేగంతో మరియు విమర్శాత్మక దృక్కోణంతో చిత్రిస్తుంది. భాషలోని సామాన్యపదజాలం, భావాలలోని వాస్తవికత, ఈ పాదాలకు సామాజిక ప్రాధాన్యతను పెంచుతున్నాయి.

నేటి సమాజపు పోకడలో విచక్షణ కోల్పోయిన (కండ్ల పోరలుగమ్మి) వ్యక్తుల స్థితిని వివరిస్తూ, "కండ్ల పోరలుగమ్మి కామముతో ఊరేగి/ వెకిలి చాష్టలతోటి వేధిస్తు వున్నాడు/ కన్న వాళ్లకు రోజు కన్నీల్లే మిగిలించి/ కౌగిలే స్వర్గమని కలలు గంటున్నాడంటూ" అనియంత్రిత కోరికల (కామముతో ఊరేగి) వెంటబడి, తన వెకిలి చేష్టలతో ఇతరులను తీవ్రంగా వేధిస్తున్నాడు అని తెలియజేస్తున్నాడు. ఆ వ్యక్తి కుటుంబంపై ఈ ప్రవర్తన చూపే వినాశనాన్ని కళ్లకు కట్టినట్లు చూపుతున్నాడు. ఇంటికి పెద్ద, రక్షకుడు (రాజు) కావలసినవాడు, కన్న తల్లిదండ్రులకు కేవలం తీర్చలేని కన్నీళ్లు మాత్రమే మిగులుస్తున్నాడు. బాధ్యతలను, విలువలను విస్మరించి, క్షణికావేశపు శారీరక సుఖాన్ని (కౌగిలిని) మాత్రమే జీవితానికి స్వర్గంగా (పరమ లక్ష్యంగా) భావించి కలలు కంటున్నాడు. చివరికి, ఈ పతనానికి మూలకారణాన్ని వివరిస్తూ, చీకటైతె చాలు చిత్తుగా తాగేసి /వావి వరుసలు కాస్త మరిచి పోతూ నరుడంటూ మద్యం మత్తులో కుటుంబ సంబంధాలు, మాన మర్యాదలు (వావి వరుసలు) వంటి కనీస నైతిక విలువలను సైతం మరిచిపోయి ఒక మనిషి కర్కశునిగా ప్రవర్తిస్తూ నైతిక, సామాజిక విలువల నుండి పూర్తిగా దూరమవుతున్నాడని ఆవేదనతో అందెశ్రీ కలం నుండి రాలిన పంక్తులివి.

అందెశ్రీకి గుర్తింపు తెచ్చిన మొట్టమొదటి పాట తెలంగాణ పల్లెల్లో ఎంతో ప్రాచుర్యం పొందిన తాగుబోతు పాట - "మాయమైపోతున్నడమ్మ... మనిషన్నవాడు'. ఆయన మొదటిసారి స్టేజిపై పాడింది కూడా ఈ పాటనే.

అందెశ్రీ తన కవిత్వం, పాటలు ఆలపించేటప్పుడు ఒక ప్రత్యేకమైన మ్యానరిజం ఉంటుంది ప్రదర్శిస్తారు. కళ్ళు మూసుకుని, తల ఊపుతూ, గంభీరంగా పాడే ఆయన శైలి, తెలుగు ప్రజలకు సుపరిచితం. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ఆయన రాసిన పాటలు, ముఖ్యంగా జయ జయహే తెలంగాణ జననీ జయ కేతనం అనే గేయం ఊపిరిగా నిలిచింది. ఈ పాట లేకుండా ఉద్యమ సభఉండేది కాదు. ఈ పాటనే తెలంగాణ రాష్ట్ర అధికారిక గీతంగా ఎంపిక చేశారు.

సినీ గేయ రచయితగా ఆయనకు 2007లో విడుదలైన గంగ చిత్రంలోని పాటలకు ఉత్తమ గీత రచయితగా ప్రతిష్ఠాత్మకమైన నంది అవార్డు లభించింది. సినీ రంగంలో ఆయన రాసిన పాటల్లో ఎంతో లోతైన భావాలు ఉంటాయి. ఒక విచిత్రం సినిమాలో ఈతరం తీర్పు అనే పాట, 'ముత్యాల ముగ్గు' సినిమాలో చిలకా ఏడున్నది అనే పాటలు ఆయనకు మంచి గుర్తింపు తెచ్చాయి.

జోల పాటలు కాదు.. పోరు పాటలు

సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం రేబర్తి గ్రామం అందెశ్రీది. ఆయనకు కులం లేదు మతం లేదు. ఆయన నలుగురు పిల్లల సర్టిఫికెట్స్ లో కులం ఉండదు. చిన్ననాటి నుంచి వెంట వచ్చిన కష్టాలను మరిచిపోవడానికి రామాయణం, యక్షగానాలు కోలాటల్లో మునిగిపోయేవాడు. తెల్లవార్లు మోట కొట్టడం, అక్కడ పని పాటలు అల్లుకోవడం అశువుగా పాడటం అబ్బింది. ఏకసంతాగ్రహి కావడం వల్ల ఆయనకు అలవోకగా బాణీలు చరణాలు తోబుట్టువులయ్యాయి. పాట ప్రవాహమైంది. తన గుండె గాయం సలుపులు తీస్తున్న కొద్దీ కంఠ గేయం చిక్కగైంది. కూలీ పని, మేస్త్రి పనీ ఇలా కనపడ్డ ప్రతి పని చేసిండు. బువ్వలేని బతుకు దుఃఖపూరితమైన జీవితం. 64 ఏళ్ల  అందెశ్రీ జీవితం వడ్డించిన విస్తరి కాదు, వడ పోతల కాగితం. తిరగబడనోడు గొప్ప కవి కాదు కదా, కనీసం కవి కూడా కాలేడు. లొంగిపోయేది, వంగిపోయేది జీవితం కాదు అంటాడు అందెశ్రీ. "జై బోలో తెలంగాణా.. జనగర్జనలా జడివాన" అని అందెశ్రీ పాడితే ఉస్మానియా యూనివర్సిటీ తొట్టెలలో వేసిన శిశువులా ఊగిపోయింది. కాంక్రీట్ జంగల్ లో మాయమైపోతున్న మానవుడిని వెతుకుతున్న సంచారి. ఆయనవి జోల పాటలు, జోకుడు పాటలు కాదు. రాజ్యం జోకొట్టి పడుకోబెట్టేవారి జబ్బజరిచి నిద్రలేపి, ఆత్మగౌరవ యుద్ధానికి సిద్ధం చేసే పోరుపాటలు. అవి మండే నిప్పు కణికలు.

'గంగ' అనే  సినిమాకు రాసిన పాటల్లో సినీ గీతాలకు తాత్విక కావ్యస్థాయిని చేకూర్చారు. తళుకు బెళుకుల టీవీ సినిమా మాధ్యమాల ఆకర్షణలకు లొంగిపోకుండా తన అస్తిత్వాన్ని ఆయన కాపాడుకున్నారు . గంగ సినిమాకు అందెశ్రీకి నంది పురస్కారం వరించింది. 2014 లో  అకాడమి ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్

**డాక్టరేట్.** 2015**లో దాశరథి సాహితీ పురస్కారం అందుకున్నారు అందెశ్రీ**, 2015**లో రావూరి భరద్వాజ సాహితీ పురస్కారం**, 2022**లో అందెశ్రీకి సుద్దాల హను మంతు - జానకమ్మ జాతీయ పురస్కారం అందుకున్నారు**.

## పోరాటానికి చిహ్నం

**అందెశ్రీ తన ఆరేళ్ల వయసు నుంచే ఆశువుగా పాటలల్లడం మొదలు పెట్టారు. తనలోని కవితాత్మను నిదురలేపి సాహితీ జిజ్ఞాసను కలిగించిన గురువులందరినీ తలచుకుంటూ 'పాటల పూదోట' లలిత గీతాల సంపుటిని** 1994 **అక్టోబరులో వెలువరించారు. అదే సంవత్సరం డిసెంబరులో 'అందెల సందడి' అనే కవితా సంపుటి అందించారు. అందెశ్రీ ఈ రెండు గ్రంథాలకు ప్రముఖ సాహితీవేత్తలు సి. నారాయణరెడ్డి, పేర్వారం జగన్నాథం, రావూరి భరద్వాజ, బోయి భీమన్న తదితరులు ముందుమాటలు రాశారు. వారందరి మాటలను క్రోడీకరిస్తే నిలిచే మాట 'అందెశ్రీని దేశం నిలపకపోతే, కాలం నిలుపుతుంది' అని, నిజంగానే కాలం గుండెల మీద చెరిగిపోని కవితా వాక్యమై ప్రతిధ్వనిస్తుంది అందెశ్రీ పాట..**

**తెలంగాణ ఉద్యమ సందర్భంలో అనేక సభల్లో అందెశ్రీ పాటలు ప్రజలను ఉర్రూతలూపాయి. 'జై బోలో తెలంగాణ/ గళ గర్జనల జడివాన/ జై బోలో తెలంగాణ/ నిలువెల్ల గాయాలవీణ!...' ఇందులో ఒక్కో కవితా పాదంలో ఎంతటి ఉత్ప్రేరక శక్తి కేంద్రీకృతమై ఉందో అందరికీ అనుభవమే. 'పల్లె నీకు వందనాలమ్మో/ ననుగన్న తల్లీ నీకు వందనాలమ్మో నాకు పాట నేర్పి ఆట నేర్పి బతుకు బాట నేర్పిన/ పల్లె నీకు వందనాలమ్మో' అనే పాటను అందెశ్రీ ఆత్మకథాత్మక గీతంగా చెప్పవచ్చు. ఇక 'కొమ్మ చెక్కితే బొమ్మరా/ కొలిసి మొక్కితే అమ్మరా..' అనే పాట అందెశ్రీలో గ్రామీణ దేవతలపై ఉన్న భక్తితత్వాన్ని ఆవిష్కరిస్తుంది. పల్లెలోని అణువణువులో ఉన్న జానపద సాంస్కృతిక అంశాలను స్మరిస్తుంది.**

**అందెశ్రీ అనగానే ఎన్నో ప్రజాదరణ పొందిన గీతాలు మనల్ని చుట్టుముడతాయి. ముఖ్యంగా మలిదశ తెలంగాణ ఉద్యమంలో 'జయ జయహే తెలంగాణ' పాట మార్చ్ ఫాస్ట్ ఉద్యమ గీతంగా ప్రజానీకాన్ని ముందుకు నడిపించింది. నేడు తెలంగాణ రాష్ట్ర అధికారిక గీతంగా అది విరాజిల్లుతోంది. తెలంగాణ సాంస్కృతిక, సామాజిక, రాజకీయ అస్తిత్వ వైభవాన్ని కీర్తించిన ఈ గీతం ఎప్పుడు విన్నా గాఢమైన భావోద్వేగాలను అందిస్తూ ఒక చారిత్రక పోరాటాన్ని, విజయాన్ని గుర్తుకు తెస్తుంది.**

## జయ జయహే తెలంగాణ

అందెశ్రీ కలం నుండి జాలువారిన "జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం" కేవలం ఒక పాట కాదు; ఇది నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగీతం, పోరాట స్ఫూర్తికి ప్రతీక. తరతరాల అణచివేత, ఆకాంక్షల పరంపరను తనలో ఇముడ్చుకున్న ఈ గీతం, ముక్కోటి గొంతుకలు ఒక్కటైన చేతనాన్ని ఆవిష్కరించింది. ప్రారంభమే ఇలా ప్రభంజనంలా నడిపించాడు.

**జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం**
**ముక్కోటి గొంతుకలు ఒక్కటైన చేతనం**
**తరతరాల చరితగల తల్లీ నీరాజనం**
**పదపదాన నీ పిల్లలు ప్రణమిల్లిన శుభ తరుణం**

తెలంగాణ ఉద్యమంలో, ఇది కేవలం ఉపందించే పాటగా కాక, ప్రజల మనోభావాలను, చరిత్రను, భవిష్యత్తు ఆశలను ప్రతిబింబించే ఉద్వేగభరితమైన నినాదంగా నిలిచింది. ఈ పాటలోని ప్రతి పదం, తెలంగాణ నేల యొక్క అస్తిత్వాన్ని, త్యాగాలను స్మరిస్తూ, రాష్ట్ర సాధన అనే 'శుభ తరుణం' వైపు ప్రజలను నడిపించిన మహత్తర శక్తి. అందుకే ఇది తెలంగాణ చరిత్రలో శాశ్వత కీర్తి పతాకం.

**జై తెలంగాణ జై జై తెలంగాణ**
**జై తెలంగాణ జై జై తెలంగాణ**

జై తెలంగాణ జై జై తెలంగాణ" అనే నినాదం కేవలం పాట యొక్క ముగింపు పల్లవి మాత్రమే కాదు; ఇది కవి అందెశ్రీ అందించిన శక్తిమంతమైన ఉద్వేగ కవాతు పిలుపు. ఈ పంక్తులు తెలంగాణ ఉద్యమకారులలో సమున్నతమైన ఐక్యతను, నిర్భయాన్ని మరియు విజయంపై అచంచల విశ్వాసాన్ని నింపాయి. రాష్ట్ర సాధన సాకారమైన తర్వాత కూడా, ఈ నినాదం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, ఈ నేల పట్ల వారి నిబద్ధతను, మరియు భవిష్యత్ నిర్మాణంలో వారి సంకల్పాన్ని ఎలుగెత్తి చాటుతూనే ఉంటుంది.
ఇది తెలంగాణ అస్తిత్వానికి చిరస్మరణీయమైన ధృవీకరణ.

**పంపనకు జన్మనిచ్చి బద్దెనకు పద్యమిచ్చి**
**భీమకవికి చనుబాల బీజాక్షరమైన తల్లి**
**హాలుని గాథాసప్తశతికి ఆయువులూదిన నేల**
**బృహత్కథల తెలంగాణ కోటిలింగాల కోన**

ఈ నాలుగు పంక్తులు కేవలం పాటలోని భాగం కాదు; ఇవి తెలంగాణ నేల యొక్క అపురూపమైన సాహిత్య వారసత్వాన్ని, చారిత్రక ఔన్నత్యాన్ని ఒక్క క్షణంలో ఆవిష్కరిస్తాయి.

'**పంపనకు జన్మనిచ్చి బద్దెనకు పద్యమిచ్చి**': ఇది కన్నడ తొలి కవి అయిన పంప కవికి తెలంగాణా జన్మభూమి అని, అలాగే ప్రసిద్ధ కవి బద్దెన (నీతిసార ముక్తావళి రచయిత) వంటి కవులకు ఈ నేల ఆశ్రయం ఇచ్చిందని స్పష్టం చేస్తోంది.

'**భీమకవికి చనుబాల బీజాక్షరమైన తల్లి**': ఇది ఈ నేల యొక్క సాహిత్య పోషణను, గొప్ప కవులకు తొలి జ్ఞానాన్ని, స్ఫూర్తిని ఇచ్చే తల్లి పాత్రను వివరిస్తుంది.

'**హాలుని గాథాసప్తశతికి ఆయువులూదిన నేల**': శాతవాహన రాజు హాలుడు ప్రాకృత భాషలో రాసిన గాథాసప్తశతి అనే గొప్ప గ్రంథానికి ఈ నేల కేంద్రంగా నిలిచిందని, ఆనాటి నుంచే ఇక్కడ సాహిత్యం విరాజిల్లిందని చెబుతుంది.

'**బృహత్కథల తెలంగాణ కోటిలింగాల కోన**': గుణాఢ్యుడు రాసిన బృహత్కథ వంటి ప్రాచీన కథలకు మూలస్థానం తెలంగాణ అని, కోటిలింగాల వంటి చారిత్రక ప్రదేశాలు ఈ నేల పవిత్రతకు, ప్రాచీనతకు నిదర్శనమని తెలుపుతుంది.

సారాంశంగా, ఈ పంక్తులు... తెలంగాణ కేవలం భౌగోళిక ప్రాంతం కాదు, ఇది వేల సంవత్సరాల తెలుగు మరియు భారతీయ సాహిత్యం, చరిత్రలకు మూల స్థానం అని సగర్వంగా ప్రకటిస్తాయి. ఈ ప్రాంతం యొక్క సాంస్కృతిక బలం ఎంత గొప్పదో చెప్పడానికి ఈ పద్యాలు తిరుగులేని సాక్ష్యం.

**ప్రజల భాషలో కావ్య ప్రమాణాలు ప్రకటించిన**
**తెలుగులో తొలి ప్రజాకవి పాలకుర్కి సోమన్న**
**రాజ్యాన్నే ధిక్కరించి రాములోరి గుడిని గట్టి**
**కవిరాజై వెలిగె దిశల కంచర్ల గోపన్న**

ఈ పంక్తులు తెలంగాణ గడ్డపై ఆవిర్భవించిన ప్రజాహిత, ధిక్కార స్ఫూర్తిని, అలాగే భక్తి సాహిత్య వైభవాన్ని ఒకేసారి ప్రకటిస్తాయి.

**పాలకుర్కి సోమన్న - తెలుగులో తొలి ప్రజాకవి**:
"ప్రజల భాషలో కావ్య ప్రమాణాలు ప్రకటించిన / తెలుగులో తొలి ప్రజాకవి పాలకుర్కి సోమన్న": పాలకుర్కి సోమనాథుడు 12వ శతాబ్దంలో తన రచనల్లో సంస్కృత ప్రాధాన్యతను తగ్గించి, ప్రజల వ్యవహారిక భాష అయిన తెలుగును కావ్య భాషగా, సాహిత్య ప్రమాణంగా ప్రకటించాడు. ఆయన తన బసవ పురాణం, పండితారాధ్య చరిత్ర వంటి గ్రంథాలలో దేశీ పదాలను, ద్విపద ఛందస్సును వాడి, సాహిత్య ఫలాలను సామాన్యులకు సైతం అందుబాటులోకి తెచ్చిన తొలి ప్రజాకవిగా చరిత్రలో నిలిచాడు.

**కంచర్ల గోపన్న (భద్రాద్రి రామదాసు) - ధిక్కార భక్తుడు**:
"రాజ్యాన్నే ధిక్కరించి రాములోరి గుడిని గట్టి / కవిరాజై వెలిగె దిశల కంచర్ల గోపన్న": ఇది తెలంగాణ ప్రాంతానికి చెందిన గొప్ప భక్తుడు, కవి అయిన కంచర్ల గోపన్న (భద్రాచల రామదాసు) యొక్క త్యాగాన్ని, ధైర్యాన్ని తెలియజేస్తుంది. ఆయన గోల్కొండ నవాబైన తానీషా అధికారంలో ఉన్నప్పటికీ, ప్రభుత్వ ధనాన్ని ఉపయోగించి భద్రాచలంలో రాముని ఆలయాన్ని నిర్మించాడు. ఈ ధిక్కార చర్యకు ఆయన కారాగార శిక్ష అనుభవించినా, తన కీర్తనల ద్వారా, భక్తి మార్గం ద్వారా దిశలన్నీ కీర్తి పొందిన కవిరాజుగా వెలుగొందారు.

ఈ ఇద్దరు వ్యక్తులు... తెలంగాణ నేల కేవలం పాలకులకు కాక, భాషకు, భక్తికి, విప్లవాత్మక ఆలోచనలకు కేంద్రంగా నిలిచిందని నిరూపిస్తున్నారు.

**కాళిదాస కావ్యాలకు భాష్యాలను రాసినట్టి**
**మల్లినాథసూరి మా మెతుకుసీమ కన్నబిడ్డ**
**ధూళికట్ట నేలినట్టి బౌద్ధానికి బంధువతడు**

**దిగ్నాగుని గన్న నేల ధిక్కారమె జన్మహక్కు**
ఈ పంక్తులు కేవలం స్వాతంత్ర్య స్ఫూర్తిని మాత్రమే కాక, తెలంగాణ గడ్డపై పుట్టిన మేధావుల గొప్పతనాన్ని కూడా ఘనంగా కీర్తిస్తాయి.

**మల్లినాథసూరి - భాష్యకర్త, మా మెతుకుసీమ బిడ్డ**:
"కాళిదాస కావ్యాలకు భాష్యాలను రాసినట్టి / మల్లినాథసూరి మా మెతుకుసీమ కన్నబిడ్డ": ఈ పంక్తులు సంస్కృత సాహిత్యంలో అపారమైన కీర్తిని పొందిన మహా పండితుడు మల్లినాథసూరిని గుర్తు చేస్తాయి. ఆయన మహాకవి కాళిదాసు రచించిన రఘువంశం, కుమారసంభవం వంటి గొప్ప కావ్యాలకు రాసిన సంజీవని, ఘంటాపథం వంటి ప్రామాణిక వ్యాఖ్యానాలు (భాష్యాలు) తరతరాలుగా సంస్కృత విద్యార్థులకు మార్గదర్శకంగా ఉన్నాయి. అలాంటి పండితుడు మెతుకుసీమ (మెదక్ జిల్లా) ప్రాంతానికి చెందినవాడని కవి సగర్వంగా ప్రకటించారు.

**దిగ్నాగుడు - బౌద్ధ తాత్వికుడు, ధూళికట్ట బంధువు**:
"ధూళికట్ట నేలినట్టి బౌద్ధానికి బంధువతడు / దిగ్నాగుని గన్న నేల ధిక్కారమె జన్మహక్కు":
ధూళికట్ట అనేది తెలంగాణలోని కరీంనగర్ జిల్లాలో ఉన్న చారిత్రక బౌద్ధారామం. ఈ పంక్తులు ఈ నేలకు బౌద్ధమతంతో ఉన్న అనుబంధాన్ని తెలియజేస్తాయి.

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన బౌద్ధ తాత్వికుడు, తర్కశాస్త్ర పితామహుడు అయిన దిగ్నాగుడు తెలంగాణ గడ్డపై జన్మించినట్లు చారిత్రక ఆధారాలు సూచిస్తున్నాయి.

అలాంటి గొప్ప మేధావులకు జన్మనిచ్చిన ఈ నేలకు, అన్యాయాన్ని ఎదిరించే 'ధిక్కారమే జన్మహక్కు'గా సంక్రమించిందని కవి బలమైన సందేశం ఇస్తున్నారు.

ఈ పంక్తులు... తెలంగాణ నేల కేవలం వ్యవసాయ భూమి కాదని, అది మేధావులకు, పండితులకు, తాత్వికులకు జన్మస్థానమని, తమ అస్తిత్వం కోసం పోరాడే ధిక్కార స్ఫూర్తికి ఆలంబన అనీ నొక్కి చెబుతున్నాయి.

**పోతనదీ పురిటిగడ్డ రుద్రమదీ వీరగడ్డ**
**గండర గండడు కొమురం భీముడే నీ బిడ్డ**
**కాకతీయ కళాప్రభల కాంతిరేఖ రామప్ప**
**గోలుకొండ భాగ్యనగరి గొప్పవెలుగు చార్మినారు**

ఈ చరణం తెలంగాణ చరిత్ర యొక్క వివిధ కోణాలను, ముఖ్యంగా ఈ గడ్డకు ఉన్న వీర వారసత్వాన్ని, భక్తి పారవశ్యాన్ని, మరియు అద్భుతమైన నిర్మాణ కళా సంపదను సంక్షిప్తంగా వివరిస్తుంది.
**భక్తి మరియు పురిటిగడ్డ**:
"**పోతనదీ పురిటిగడ్డ**": బమ్మెర పోతన, తెలుగు సాహితీ జగత్తుకు శ్రీమదాంధ్ర మహాభాగవతం వంటి అత్యున్నత గ్రంథాన్ని అందించిన మహాకవి. ఈ పంక్తి ఆయనకు జన్మనిచ్చిన నేలగా తెలంగాణ యొక్క భక్తి, సాహిత్య ప్రాధాన్యతను నిరూపిస్తుంది.

**వీరత్వం మరియు ధిక్కారం**:
"**రుద్రమదీ వీరగడ్డ / గండర గండడు కొమురం భీముడే నీ బిడ్డ**":
రుద్రమదేవి భారత చరిత్రలోనే అత్యంత ధైర్యశాలి అయిన రాణులలో ఒకరు. ఆమె పాలించిన కాకతీయ సామ్రాజ్యానికి తెలంగాణ కేంద్రంగా నిలిచింది. ఇది ఈ గడ్డ యొక్క వీరత్వానికి నిదర్శనం.
కొమురం భీమ్, నిజాం పాలనపై గెరిల్లా పోరాటం చేసి, 'జల్, జంగిల్, జమీన్' నినాదంతో పోరాడిన గండర గండడు. ఆయన తెలంగాణ ఆత్మగౌరవ పోరాటంలో ఓడిపోని ధీరోదాత్తతకు ప్రతీక.

**కళ మరియు కీర్తికి పతాకాలు**:
"**కాకతీయ కళాప్రభల కాంతిరేఖ రామప్ప / గోలుకొండ భాగ్యనగరి గొప్పవెలుగు చార్మినారు**":
**రామప్ప దేవాలయం** (Ramappa Temple): ఇది కాకతీయుల శిల్పకళా వైభవానికి పరాకాష్ఠ. ఈ ఆలయం ఇటీవల UNESCO ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించబడటం తెలంగాణ కళాత్మక గొప్పతనానికి కాంతిరేఖ.
**చార్మినార్** (Charminar): గోల్కొండ (కుతుబ్‌షాహీల) పాలనలో నిర్మించబడిన భాగ్యనగరం (హైదరాబాద్) యొక్క ఈ గొప్ప కట్టడం, తెలంగాణ చారిత్రక వైభవాన్ని, వాస్తు శిల్ప కళా నైపుణ్యాన్ని ప్రపంచానికి చాటి చెబుతున్న కీర్తి చిహ్నం.

ఈ పంక్తులు తెలంగాణ గడ్డ యొక్క చారిత్రక వైవిధ్యతను, గొప్ప కవులను, వీరాంగనలను, మరియు ప్రపంచాన్ని ఆకర్షించే కళా సంపదను అద్భుతంగా మిళితం చేశాయి.

**రాచకొండ ఏలుబడిగ రంజిల్లిన రేచర్ల**
**సర్వజ్ఞ సింగ భూపాలుని బంగరు భూమి**
**వాణీ నా రాణి అంటు నినదించిన కవికులరవి**
**పిల్లలమఱి పిన వీరభద్రుడు మాలో రుద్రుడు**
ఈ పంక్తులు తెలంగాణ చరిత్రలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న రాచకొండను పాలించిన రేచర్ల పద్మనాయక వంశం యొక్క పాలనా వైభవాన్ని, ముఖ్యంగా వారికి సాహిత్య రంగంపై ఉన్న ప్రేమను వివరిస్తాయి.

**సర్వజ్ఞ సింగ భూపాలుడు - బంగరు భూమి**:
"**రాచకొండ ఏలుబడిగ రంజిల్లిన రేచర్ల / సర్వజ్ఞ సింగ భూపాలుని బంగరు భూమి**": రేచర్ల సింగమ నాయకుడు (సర్వజ్ఞ సింగ భూపాలుడు) కేవలం పాలకుడు మాత్రమే కాదు, ఆయన గొప్ప పండితుడు, కవి, మరియు సంగీతజ్ఞుడు. ఆయన రాచకొండ రాజధానిగా పాలన కొనసాగించారు. 'సర్వజ్ఞుడు' అనే బిరుదు ఆయన వివిధ శాస్త్రాలలో ఉన్న ప్రావీణ్యాన్ని సూచిస్తుంది. ఆయన పాలనలో సాహిత్యం, కళలు స్వర్ణయుగాన్ని అనుభవించాయి, అందుకే ఈ నేల ఆయనకు 'బంగరు భూమి'గా నిలిచింది.

**పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడు - కవికుల రవి**:
"**వాణీ నా రాణి అంటు నినదించిన కవికులరవి / పిల్లలమఱి పిన వీరభద్రుడు మాలో రుద్రుడు**": పిల్లలమఱి పినవీరభద్రుడు రేచర్ల ఆస్థానంలో వెలుగొందిన అష్టదిగ్గజ కవులలో ఒకరు.

'**వాణీ నా రాణి**' (**సరస్వతియే నా రాణి**) అనే గర్వోక్తులతో పండిత లోకాన్ని మెప్పించిన గొప్ప కవి ఆయన. ఆయన రచించిన శృంగార శాకుంతలం తెలుగు సాహిత్యంలో ప్రసిద్ధి చెందింది.

ఈ పంక్తులు... తెలంగాణ నేల కేవలం పోరాటాలకే కాదు, సాహిత్య, కళా రంగాలలో కూడా అత్యున్నత ప్రమాణాలు సృష్టించిన పాలకులు, కవులకు ఆశ్రయం ఇచ్చిందని, రేచర్ల వంశం ద్వారా తెలంగాణకు లభించిన సాంస్కృతిక వారసత్వాన్ని ఘనంగా ప్రకటిస్తున్నాయి.

**సమ్మక్కలు సారక్కలు సర్వాయి పాపన్నలు**
**సబ్బండ వర్ణాల సాహసాలు కొనియాడుతు**
**ఊరూర పాటలైన మీరసాబు వీరగాధ**
**దండు నడిపే పాలమూరు 'పండుగోల్ల సాయన్న'**
ఈ పంక్తులు కేవలం పాలక వర్గాల చరిత్రను కాకుండా, **తెలంగాణ సామాజిక ఉద్యమాలలో కీలక పాత్ర పోషించిన సామాన్య**, **బహుజన వర్గాల నాయకులను**, **వారి తిరుగుబాటు స్ఫూర్తిని** సగర్వంగా ప్రకటిస్తున్నాయి.

**సమ్మక్క**, **సారక్క మరియు సర్వాయి పాపన్న**:
"**సమ్మక్కలు సారక్కలు సర్వాయి పాపన్నలు / సబ్బండ వర్ణాల సాహసాలు కొనియాడుతు**": ఈ పంక్తులు తెలంగాణ **ఆత్మగౌరవానికి**, **తిరుగుబాటు స్ఫూర్తికి** ప్రతీకలైన వీరులను స్మరిస్తాయి.

**సమ్మక్క-సారక్క** (**మేడారం జాతర**): ఇద్దరు గొప్ప **గిరిజన వీరాంగనలు**, కాకతీయ పాలకులపై ప్రజల తరపున పోరాడి, తమ ప్రాణాలను అర్పించారు.

**సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్**: బహుజన వర్గానికి చెందిన ఈ ధీరుడు, మొఘల్ పాలకుల అన్యాయాన్ని ధిక్కరించి, తిరుగుబాటు నాయకుడిగా ఎదిగి, పాలకులకు సవాలు విసిరాడు.

ఈ నాయకులు '**సబ్బండ వర్ణాల**' (అన్ని వర్ణాల) ప్రజల తరపున పోరాడి, వారి సాహసాన్ని ప్రదర్శించారు.

**మీరసాబు**, **పండుగోల్ల సాయన్న - దళిత**, **బూరన్న నాయకులు**:
"**ఊరూర పాటలైన మీరసాబు వీరగాధ / దండు నడిపే పాలమూరు 'పండుగోల్ల సాయన్న'**":
**మీరసాబు వీరగాథ**: ఇది తెలంగాణ **దళిత**, **ముస్లిం** వర్గాలలో ప్రసిద్ధి చెందిన ఒక జానపద కథ. సామాన్య ప్రజల కష్టాలను తీర్చడానికి, అన్యాయాన్ని ఎదిరించడానికి మీరసాబు చేసిన పోరాటం, ఆయన **వీరగాథగా** ఊరూరా పాడుకునే కథా రూపంలో నిలిచింది.

**పండుగోల్ల సాయన్న**: పాలమూరు (మహబూబ్‌నగర్) ప్రాంతంలో దళిత వర్గానికి చెందిన **పండుగోల్ల సాయన్న** వంటి వీరులు, జమీందార్ల పెత్తనాన్ని, నిజాం పాలనను ఎదిరించి **దండు** (**సైన్యం**) నడిపిన సాహస గాథలు తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి మూలాధారం.

ఈ చరణం... **తెలంగాణ ఉద్యమం చరిత్రలో కేవలం ఉన్నత వర్గాల నాయకత్వమే కాదు**, **సామాజికంగా అణచివేయబడిన వర్గాల నుంచి ఉద్భవించిన వీరుల పోరాటం**, **త్యాగం కూడా ఇమిడి ఉంది**, ఆ వీరగాథలే తెలంగాణకు నిజమైన **జననీ జయకేతనం** అని బలంగా ప్రకటిస్తుంది.

**కవి గాయక వైతాళిక కళలా మంజీరాలు**
**డప్పు ఢమరుకము డక్కి శారద స్వరనాదాలు**
**పల్లవులా చిరు జల్లుల ప్రతి ఉల్లము రంజిల్లగ**
**అను నిత్యం నీ గానం అమ్మ నీవె మా ప్రాణం**
ఈ చరణంలో అందె శ్రీ తెలంగాణ పాట యొక్క సారస్వత సౌందర్యాన్ని, జానపద కళల వైభవాన్ని, మరియు ప్రజలకు ఈ నేల పట్ల ఉన్న ఆత్మ బంధాన్ని కవి అందెశ్రీ భావోద్వేగభరితంగా వ్యక్తం చేశాడు.

**కళల మంజీరాలు - స్వరనాదాలు**:
"**కవి గాయక వైతాళిక కళలా మంజీరాలు / డప్పు ఢమరుకము డక్కి శారద స్వరనాదాలు**":
తెలంగాణ గడ్డ కవులు, గాయకులు, వైతాళికుల (ప్రాచీన కవులు/కీర్తి గానం చేసేవారు) యొక్క కళల సమూహాలకు నిలయం.

ఈ నేల యొక్క సంగీతం కేవలం శాస్త్రీయ రూపానికే పరిమితం కాదు. డప్పు, ఢమరుకం, డక్కి (డక్కీ) వంటి జానపద వాయిద్యాల శబ్దాలు ఇక్కడి సామాన్య ప్రజల పండుగలు, పౌరాణిక కథలు, సామాజిక అంశాలలో అంతర్లీనంగా ఉంటాయి.
శారద (వీణ) వంటి శాస్త్రీయ వాద్యాల స్వరనాదాలు సైతం ఇక్కడ కలుపుకొని పోతాయి. ఇది తెలంగాణ కళారూపాల వైవిధ్యతకు చిహ్నం.
**ఉల్లము రంజిల్లగ - నిత్య గానం**:
"**పల్లవులా చిరు జల్లుల ప్రతి ఉల్లము రంజిల్లగ / అను నిత్యం నీ గానం అమ్మ నీవె మా ప్రాణం**":
తెలంగాణ పాటలు, కళలు 'పల్లవులు' (కొత్త మొలకలు) వేసిన చిరుజల్లుల మాదిరిగా ప్రతి ఒక్కరి ఉల్లము (హృదయాన్ని) ఆనందంతో, ఉల్లాసంతో నింపుతాయి.

ఈ నేల యొక్క చరిత్ర, సంస్కృతి, పోరాటం అనునిత్యం (ప్రతి రోజు) ప్రజల నాలుకపై గానమై వినిపిస్తుంది.

**అంతిమ బంధం**:
ఈ పంక్తులు 'అమ్మ నీవె మా ప్రాణం' అనే భావోద్వేగభరితమైన ప్రకటనతో ముగుస్తాయి. తెలంగాణ ప్రజలకు ఈ నేల కేవలం ఒక ప్రాంతం కాదు, ప్రాణం వంటిది. ఇది తెలంగాణ తల్లిపై ప్రజలకు ఉన్న గాఢమైన అనురాగాన్ని, అస్తిత్వ బంధాన్ని తెలియజేస్తుంది.

ఈ చరణం... తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని, జానపద కళల ఔన్నత్యాన్ని చాటుతూ, ఈ గడ్డ తమకు కేవలం తల్లి మాత్రమే కాదు, తమ అస్తిత్వానికి మూలమైన ప్రాణం అని కవిత్వం ద్వారా ప్రకటించిన మహోన్నత ఆత్మ బంధం.

**జానపదా జనజీవన జావళీలు జాలువార**
**జాతిని జాగృత పరచే గీతాల జన జాతర**
**వేలకొలదిగా వీరులు నేల ఒరిగి పోతేనేమి**
**తరుగనిదీ నీ త్యాగం మరువనిదీ శ్రమయాగం**
ఈ పంక్తులు తెలంగాణ జానపద సాహిత్యం ఉద్యమంలో పోషించిన పాత్రను, అలాగే రాష్ట్ర సాధన కోసం ఎందరో చేసిన అత్యున్నత త్యాగాన్ని, శ్రమయాగాన్ని ప్రతిబింబిస్తాయి.

**జనజీవన జావళీలు - జన జాతర**:
"**జానపదా జనజీవన జావళీలు జాలువార / జాతిని జాగృత పరచే గీతాల జన జాతర**":
తెలంగాణ పాటలు, కళలు కేవలం వినోదం కోసం కాదు; అవి జనజీవన జావళీలు (ప్రజల జీవితాన్ని ప్రతిబింబించే పాటలు).

ఈ జానపద గీతాలు, ఒగ్గు కథలు, బుర్ర కథలు వంటి కళారూపాలు జాతిని (సమాజాన్ని) అన్యాయంపై, అణచివేతపై పోరాడటానికి జాగృత పరచడంలో కీలక పాత్ర పోషించాయి.

ఈ గీతాల ద్వారా ప్రజలు ఒక్కటవడం ఒక జన జాతర వలె మారింది అంటే, ఉద్యమం ఒక పండుగలా, ఉత్సవంలా ప్రజలందరినీ ఏకం చేసింది.

**త్యాగం - మరువని శ్రమయాగం**:
"**వేలకొలదిగా వీరులు నేల ఒరిగి పోతెనేమి / తరుగనిదీ నీ త్యాగం మరువనిదీ శ్రమయాగం**":
ఉద్యమ సమయంలో వేలకొలది వీరులు (అమరులు) తమ లక్ష్యం కోసం ప్రాణాలర్పించారు (నేల ఒరిగి పోయారు).

అయితే, వారి త్యాగం ఎప్పటికీ తరుగనిది, అంటే అనంతమైనది. వారి బలిదానం వృథా పోలేదు.
రాష్ట్ర సాధన కోసం సాగిన సుదీర్ఘ పోరాటం కేవలం బలిదానం మాత్రమే కాదు, ఇది ప్రజలందరూ చేసిన 'మరువని శ్రమయాగం' అంటే, ఉద్యమం కోసం సాగిన ఎంతో కష్టం, ప్రయాణం, కృషి. ఈ శ్రమయాగం యొక్క విలువను, చరిత్రను ఎప్పటికీ మర్చిపోలేం.

ఈ చరణం... తెలంగాణ ఉద్యమంలో పాట, కళల శక్తి ఎంత గొప్పదో, మరియు ఆ లక్ష్యం కోసం అమరులు చేసిన త్యాగాలు, ప్రజలు పడిన శ్రమ యావత్తూ రాష్ట్ర సాధనకు పునాదులయ్యాయని భావోద్వేగపూరితంగా ప్రకటిస్తుంది.

**బడుల గుడులతో పల్లెల ఒడలు పులకరించాలి
విరిసే జనవిజ్ఞానం నీ కీర్తిని పెంచాలి
తడబడకుండా జగాన తల ఎత్తుకోని బ్రతుక
ఒక జాతిగ నీ సంతతి ఓయమ్మ వెలగాలి**
ఈ పంక్తులు రాష్ట్ర సాధన తరువాత తెలంగాణ తల్లి తన పిల్లల నుంచి, మరియు నూతన సమాజం నుంచి ఏం ఆశిస్తుందో వివరిస్తాయి. ఇది పాట యొక్క ముఖ్య సందేశాలలో ఒకటి—కేవలం గతాన్ని స్మరించుకోవడం కాదు, ఉత్తమ భవిష్యత్తును నిర్మించుకోవాలనే సంకల్పం.

**పల్లెల పులకింతలు - జన విజ్ఞానం**:
"**బడుల గుడులతో పల్లెల ఒడలు పులకరించాలి / విరిసే జనవిజ్ఞానం నీ కీర్తిని పెంచాలి**":
ఇక్కడ 'బడులు' (పాఠశాలలు) విద్యకు, 'గుడులు' (దేవాలయాలు/సాంస్కృతిక కేంద్రాలు) సాంస్కృతిక, సామాజిక ఐక్యతకు ప్రతీకలు. ఈ రెండింటి అభివృద్ధి ద్వారా పల్లెలు (గ్రామాలు) చైతన్యవంతమై, పులకించి, నిజమైన అభివృద్ధిని సాధించాలి.

ఈ చైతన్యం ద్వారా 'విరిసే జనవిజ్ఞానం' (ప్రజల్లో వికసించే జ్ఞానం, శాస్త్రీయ దృక్పథం) తెలంగాణ యొక్క కీర్తిని, పేరు ప్రఖ్యాతులను పెంచాలి. విద్య ద్వారానే అసలైన అభివృద్ధి సాధ్యమని కవి నొక్కి చెప్పారు.

**జగాన తల ఎత్తుకోవడం - జాతిగా వెలగడం**:
"**తడబడకుండా జగాన తల ఎత్తుకోని బ్రతుక / ఒక జాతిగ నీ సంతతి ఓయమ్మ వెలగాలి**":
తెలంగాణ ప్రజలు ఇకపై ఏ ఇబ్బంది లేకుండా, తడబడకుండా, ప్రపంచ వేదికపై 'తల ఎత్తుకోని' (గౌరవంగా, ఆత్మవిశ్వాసంతో) జీవించాలి.

తమకంటూ ఒక ప్రత్యేక అస్తిత్వాన్ని, గుర్తింపును సాధించిన తెలంగాణ ప్రజలు 'ఒక జాతిగ' (A nation/collective identity) ప్రపంచానికి తమ గొప్పదనాన్ని చాటిచెబుతూ 'వెలగాలి' (శోభించాలి, ప్రకాశించాలి) అని కవి ఆకాంక్షించారు.

ఈ చరణం... తెలంగాణ భవిష్యత్తు ఆకాంక్షను విద్య, జ్ఞానం, ఆత్మవిశ్వాసంపై ఆధారపడిన సమగ్ర అభివృద్ధిలో చూస్తుంది. ప్రపంచంలో ఒక గొప్ప జాతిగా వెలగడానికి పల్లెల నుంచి జ్ఞాన జ్యోతిని వెలిగించడమే మార్గమని స్పష్టం చేస్తుంది.

**సిరి వెలుగులు జిమ్మె సింగరేణి నల్ల బంగారం
అణువణువున ఖనిజాలే నీ తనువున సింగారం
సహజమైన వన సంపద సక్కనైన పువ్వుల పొద
సిరులు పండె సారమున్న మాగాణమె కద నీ యెద**

ఈ పంక్తులు తెలంగాణ యొక్క ఆర్థిక, సహజ సంపదను ముఖ్యంగా దానిలోని బొగ్గు నిల్వలు, అపారమైన ఖనిజాలు, పచ్చని అడవులు మరియు సారవంతమైన వ్యవసాయ భూమిని కీర్తిస్తున్నాయి.

**సింగరేణి - నల్ల బంగారం**:
"**సిరి వెలుగులు జిమ్మే సింగరేణి నల్ల బంగారం**":
సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (SCCL) తెలంగాణకు గర్వకారణం. ఇక్కడ లభించే బొగ్గును 'నల్ల బంగారం'తో పోలుస్తారు, ఎందుకంటే ఇది రాష్ట్రానికి, దేశానికి విద్యుత్ మరియు ఆర్థిక సిరి వెలుగులను (సంపద, కాంతి) అందిస్తుంది. ఇది తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన ఖనిజ సంపదకు ప్రతీక.

**ఖనిజాల సింగారం**:
"**అణువణువున ఖనిజాలే నీ తనువున సింగారం**":
బొగ్గుతో పాటు, తెలంగాణ నేలలో ఇనుప ఖనిజం, సున్నపురాయి, క్వార్ట్జ్, ఫెల్డ్‌స్పార్ వంటి అనేక రకాల ఖనిజాలు అణువణువునా నిక్షిప్తమై ఉన్నాయి. ఈ ఖనిజ సంపద ఈ భూమికి సహజసిద్ధమైన సింగారం (అలంకారం) వంటిది.

**సహజ వన సంపద - వ్యవసాయ సారము**:
"**సహజమైన వన సంపద సక్కనైన పువ్వుల పొద / సిరులు పండె సారమున్న మాగాణమె కద నీ యెద**":
ఈ నేల యొక్క సహజమైన వన సంపద (అడవులు), సక్కనైన పువ్వుల పొదలు (అందమైన పూల మొక్కలు) ఇక్కడి పర్యావరణ వైభవాన్ని, జీవ వైవిధ్యాన్ని సూచిస్తాయి.

తెలంగాణ యొక్క అంతిమ సంపద 'సిరులు పండే' (ధాన్యాన్ని పండించే) సారమున్న మాగాణం (సారవంతమైన వ్యవసాయ భూమి). ఈ సారవంతమైన భూమియే తెలంగాణ తల్లి యొక్క 'యెద' (గుండె), అంటే ఈ నేల యొక్క ప్రాణం వ్యవసాయ సంపదలోనే ఉంది.

ఈ చరణం... తెలంగాణ గడ్డ భూగర్భంలో దాగిన ఖనిజ సంపదను, ఉపరితలంపై విస్తరించిన పచ్చని అడవులను, మరియు వ్యవసాయ భూమి యొక్క అపారమైన శక్తిని ఏకకాలంలో కీర్తిస్తూ, ఈ నేల యొక్క సమగ్ర సంపదను ప్రస్ఫుటం చేస్తుంది.

**గోదావరి కృష్ణమ్మలు తల్లీ నిను తడుపంగ**
**పచ్చని మా నేలల్లో పసిడి సిరులు పండంగ**
**సుఖశాంతుల తెలంగాణ సుభిక్షంగ ఉండాలె**
**ప్రతి దినమది తెలంగాణ ప్రజల కలలు పండాలి**
ఈ చరణం తెలంగాణ రాష్ట్రానికి దక్కిన జల వరాన్ని, ముఖ్యంగా గోదావరి, కృష్ణా నదుల ప్రాముఖ్యతను తెలుపుతూ, ఈ వనరుల ద్వారా భవిష్యత్తులో తెలంగాణ సుఖశాంతులతో, సుభిక్షంగా ఉండాలనే అంతిమ లక్ష్యాన్ని కవి ప్రకటించారు.

**గోదావరి**, **కృష్ణమ్మల వరం**:
"**గోదావరి కృష్ణమ్మలు తల్లీ నిను తడుపంగ**": తెలంగాణ రాష్ట్రానికి జీవనాధారాలైన గోదావరి, కృష్ణా నదులు. ఈ రెండు నదులు తెలంగాణ తల్లిని తడుపడం అంటే, జల వనరులను అందించడం. ఈ నీరే తెలంగాణ ప్రజలకు సాగు, తాగునీటి అవసరాలను తీరుస్తూ ఈ నేల సశ్యశ్యామలంగా ఉండటానికి ఆధారం. ఇది ఈ నేలకు దక్కిన గొప్ప భౌగోళిక వరం.

**పసిడి సిరుల పంటలు**:
"**పచ్చని మా నేలల్లో పసిడి సిరులు పండంగ**": నదుల నీరు లభించడం వలన, తెలంగాణలోని పచ్చని నేలల్లో 'పసిడి సిరులు' (బంగారం వంటి పంటలు) పండాలి. ఇక్కడ 'పసిడి సిరులు' అంటే అత్యున్నత దిగుబడి, ఆర్థిక శ్రేయస్సును సూచిస్తాయి. జల వనరుల వినియోగం ద్వారా రాష్ట్రం వ్యవసాయ రంగంలో గొప్పగా అభివృద్ధి చెందాలనే ఆకాంక్ష ఇది.

**సుఖశాంతులు**, **సుభిక్షం**:
"**సుఖశాంతుల తెలంగాణ సుభిక్షంగ ఉండాలె**": రాష్ట్ర సాధన యొక్క అంతిమ లక్ష్యం సుఖశాంతులు (శాంతి, ఆనందం) మరియు సుభిక్షంగా (సమృద్ధిగా, లోటు లేకుండా) జీవించడం. నదుల నీరు, పంటల సమృద్ధి ప్రజల జీవితాలలో ఈ సుఖశాంతులను తీసుకురావాలని కవి కోరుకున్నారు.

**కలల పంట**:
"**ప్రతి దినమది తెలంగాణ ప్రజల కలలు పండాలి**": కేవలం రాష్ట్రం ఏర్పడటమే కాకుండా, ప్రజలందరూ ఏళ్ల తరబడి చూసిన కలలు, ఆశలు ప్రతి రోజు నిజం కావాలి. ఈ కలలు పండడం అంటే, తెలంగాణ ప్రజలందరూ గౌరవంగా, సంతోషంగా, ఆర్థికంగా స్థిరంగా జీవించడమే.

ఈ చరణం... తెలంగాణ భౌగోళిక వరాన్ని గుర్తించి, ఆ జల సంపదను సద్వినియోగం చేసుకొని, రాష్ట్రం సుభిక్షంగా మారి, ప్రజల ఆశలు, కలలు నెరవేరాలనే అత్యున్నత ఆకాంక్షను తెలియజేస్తూ పాటను ముగించారు.

(Abridged Version)
**జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం**
**ముక్కోటి గొంతుకలు ఒక్కటైన చేతనం**
**తర తరాల చరిత గల తల్లీ నీరాజనం**
**పద పదాన నీ పిల్లలు ప్రణమిల్లిన శుభ తరుణం**
**జై తెలంగాణ జై జై తెలంగాణ**
**జై తెలంగాణ జై జై తెలంగాణ**
**జానపద జన జీవన జావళీలు జాలువార**
**కవి గాయక వైతాళిక కళలా మంజీరాలు**
**జాతిని జాగృత పరచే గీతాల జన జాతర**
**అను నిత్యం నీ గానం అమ్మ నీవె మా ప్రాణం**
**జై తెలంగాణ జై జై తెలంగాణ**
**జై తెలంగాణ జై జై తెలంగాణ**
**గోదావరి కృష్ణమ్మలు తల్లీ నిను తడుపంగ**
**పచ్చని మా నేలల్లో పసిడి సిరులు పండంగ**
**సుఖశాంతుల తెలంగాణ సుభిక్షంగ ఉండాలె**
**ప్రతి దినమది తెలంగాణ ప్రజల కలలు పండాలి**
**జై తెలంగాణ జై జై తెలంగాణ**
**జై తెలంగాణ జై జై తెలంగాణ**
**ఆత్మగీతం: పోరాట స్ఫూర్తి - అస్తిత్వ ఆకాంక్ష**

అందెశ్రీ రచించిన ఈ పాట తెలంగాణ ఉద్యమకారుల పాలిట వేద ఘోష వంటిది. ఈ చరణాలు గౌరవప్రదమైన గతం, శక్తివంతమైన వర్తమానం, మరియు ఉజ్వలమైన భవిష్యత్తు అనే త్రివేణి సంగమాన్ని ఆవిష్కరిస్తాయి.

1. **ప్రారంభ సందేశం (ఆత్మ నివేదన)**
ప్రారంభ చరణాలు తెలంగాణ తల్లిని 'జననీ జయకేతనం' (విజయ పతాకం)గా కీర్తిస్తాయి. "ముక్కోటి గొంతుకలు ఒక్కటైన చేతనం" అనే పంక్తి ఈ గీతం యొక్క ప్రజాస్వామ్య స్ఫూర్తిని, సామూహిక ఐక్యతను చాటుతుంది. తెలంగాణ చరిత్రను, పోరాట త్యాగాన్ని స్మరిస్తూ, "పద పదాన నీ పిల్లలు ప్రణమిల్లిన శుభ తరుణం" అనే వాక్యం రాష్ట్ర సాధన అనే పవిత్ర క్షణాన్ని ఉద్వేగభరితంగా ప్రకటిస్తుంది.

2. **జానపద కళల శక్తి (సంస్కృతి, స్ఫూర్తి)**
మధ్య చరణాలు సాంస్కృతిక వైభవాన్ని, ఉద్యమంలో కళల పాత్రను వివరిస్తాయి. "జానపద జన జీవన జావళీలు" (ప్రజల జీవితాన్ని ప్రతిబింబించే పాటలు) మరియు "కవి గాయక వైతాళిక కళలా మంజీరాలు" ద్వారా తెలంగాణ కళల వైవిధ్యత, లోకాయిత స్వభావాన్ని చెబుతారు. "జాతిని జాగృత పరచే గీతాల జన జాతర" అనే వాక్యం... అణచివేతపై పోరాటానికి కళలు శక్తివంతమైన ఆయుధంగా ఎలా మారాయో, ప్రజలను ఎలా ఏకం చేశాయో స్పష్టం చేస్తుంది. అంతిమంగా, "అను నిత్యం నీ గానం అమ్మ నీవె మా ప్రాణం" అంటూ ఈ నేల పట్ల ఉన్న గాఢమైన ఆత్మబంధాన్ని ప్రకటిస్తారు.

3. **అంతిమ లక్ష్యం (సుభిక్ష ఆకాంక్ష)**
ముగింపు చరణాలు భవిష్యత్తుపై ఉన్న ఆశను, ఆకాంక్షను తెలియజేస్తాయి. గోదావరి, కృష్ణా నదులు తెలంగాణ తల్లిని తడుపుతూ, "పచ్చని మా నేలల్లో పసిడి సిరులు పండంగ" అనే ఆశతో వ్యవసాయ, ఆర్థిక సమృద్ధిని కోరుకుంటారు. ఈ భౌగోళిక వరం ద్వారా తెలంగాణ "సుఖశాంతుల... సుభిక్షంగ ఉండాలె" అనే లక్ష్యాన్ని చేరుకోవాలని, చివరికి "ప్రతి దినమది తెలంగాణ ప్రజల కలలు పండాలి" అని ఆకాంక్షిస్తారు.

ఈ పాట కేవలం చారిత్రక వర్ణన కాదు; ఇది ప్రజల ఆకాంక్ష, పోరాటం, సంస్కృతి, మరియు సుభిక్ష భవిష్యత్తు అనే అంశాలను ఏకతాటిపై నిలిపిన అద్భుతమైన సాహితీ విప్లవం. ఇది తెలంగాణ ప్రజలకు గతానికి వారధి, భవిష్యత్తుకు మార్గదర్శి.

## సారాంశం

**అందెశ్రీ ఒక ఆధ్యాత్మిక బాటసారి. దారి పొడవునా పాట తోడుగా నడిచి పోయే జానపదుడు. మనిషిని కేంద్రంగా చేసుకుని మానవీయ జీవన విలువల కోసం ఆయన అన్వేషించారు. 'మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు' పాటలో మానవత్వం పరిమళించే వ్యక్తికోసం భూగోళమంతా ప్రతిధ్వనించేలా తన భావాలను వినిపించారు. అందెశ్రీకి కావాల్సింది కేవలం భౌతికమైన మనుషులే కాదు. ఆ మనుషుల మనసులు మానవత్వంతో నిండిపోవాలి. మరో మనిషి పట్ల ప్రేమతో స్పందించగలగాలి. అలాంటి నిజమైన మనిషి కోసం ఆయన ఆవేదనతో ఆలపించారు. క్షీణిస్తున్న మానవ సంబంధాల పట్ల అందెశ్రీ చేసిన ఈ విలాపం ఇంకా వినబడటమే విషాదం. ప్రతి వ్యక్తినీ ఆత్మవిమర్శకు పురిగొల్పే పాట ఇది. అందెశ్రీ శాశ్వత చిరునామాల్లో ఈ గీతం ప్రథమ శ్రేణిలో నిలబడుతుంది.**

**నేడు ఆధునిక యుగంలో మానవ సంబంధాలన్నీ మనీ సంబందాలుగా మారిపోయాయి. నేటి మనుషులు "మనీ" షి' కోసం జీవిస్తున్నారని తెలంగాణ ప్రజా కవి అందెశ్రీ గారు "తన అశుకవిత్వ సాహిత్యంలో 'మాయమై పోతున్నడమ్మా మనిషన్న వాడు' లో కళ్లకు కట్టినట్లు వివరించాడు. తెలంగాణ పల్లెల్లో ఎంతో ప్రాచుర్యము పొందిన పాట ఇది. ఈ పాటలో తెలంగాణ సమాజంలో తాను ప్రత్యక్షంగా చూసి, ఆదాయ అసమానతలను, మానవ సంబందాలలో స్వార్థాన్ని, మోసాలను, అవినీతిని పాట రూపంలో కవిత ధారగా, ఉన్నది ఉన్నట్లు, నిర్భయంగా, నిర్మొహమాటంగా ప్రపంచీకరణలో మాయమై పోతున్న మనిషిని వెతుకుతున్న లోకకవి అందె శ్రీ గారు."మానవ మెదడు కోరికల పుట్ట". ఒక కోరిక తీరిన వెంటనే మరో కోరిక కోరుతాడు. అందుకే ఈ పాటలో ఇరవైదుపైసలు అగరవత్తులు వెలిగించి, కోట్ల వరాలు కోరుతారని, కోటి విద్యల కోట్లాటలల్లో పడి కోట్లకు పరిగెత్తే కోరికలుగా మారాయని తన సాహిత్యం ద్వారా కలియుగపు మనిషి ఉనికిని చక్కగా వివరించారు. తెలంగాణ పాటలలో ఈ పాట ఆణిముత్యం, అందె శ్రీ ఆశు కవిత్వంలో మచ్చుతునక.అన్ని రకాల హావభావాలను సులభంగా ఇముడ్చుకునే ఆయన గొంత పాటని రాష్ట్రవ్యాప్తంగా తీసుకెళ్లింది. సీని దర్శకుడు నారాయణ మూర్తి ద్వారా వచ్చిన విప్లవాత్మక సినిమాల విజయం వెనుక ఆయన పాటలున్నాయి. ఆయన తాత్వికత**

**భజన భజంత్రీల పాటలు వద్దు,<br>ఎంగిలి పాటలు రాయకు<br>నీవు చూసిన బతుకుపాటలు రాయి**

**నీకై నీవె కైకట్టు – మనసుపెట్టి...<br>అనేది ఆయన ఆయన తత్వచింతన .**

**జీవితంలో ఎన్నో కష్టాలు ఎదుర్కొన్న ఈ ప్రజాకవికి, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆయన సేవలకు గాను ప్రభుత్వం రూ. కోటి రూపాయల నగదు పురస్కారం అందించింది. ఆయన జీవితం కష్టాల నుంచి గొప్ప గౌరవం వైపు సాగిన ప్రయాణానికి ఉదాహరణ.తెలంగాణ సాహిత్య చరిత్ర పునర్నిర్మాణ దశలో భాగంగా అందెశ్రీ** 1307 **పేజీలతో 'నిప్పులవాగు' అనే బృహత్ కవితలు, పాటల సంకలనాన్ని తెచ్చారు. ఈ భూగోళం మీద ప్రవహిస్తున్న అన్ని నదులపై ప్రయాణిస్తూ ఒక బృహత్ నదీకావ్యం రాయాలని స్వప్నించారు. అది సాకారమయ్యే వేళ అందరినీ కన్నీటి నదిలో ముంచేసి వెళ్లిపోయారు. అందెశ్రీ తన 'అందెల సందడి'ని అలిశెట్టి ప్రభాకర్ కు అంకితమిస్తూ 'ప్రజాకవిగా ప్రభవించిన అజరామరుడు' అని ఆయనను కీర్తించారు. అందెశ్రీ కూడా అలాంటి అజరామర కవే!**

## ఆధార గ్రంథాలు

[1]. **ఈనాడు దిన పత్రిక వ్యాసాలు**
[2]. **దిశ దిన పత్రిక వ్యాసాలు**
[3]. **విమల సాహితి ఫేస్ బుక్**
[4]. **డాక్టర్ . యస్ . రఘు ఈనాడు దిన పత్రిక ఎడిటోరియల్ వ్యాసం**

[5]. వెలుగు దిన పత్రిక వ్యాసాలు
[6]. https://andhrapradesh.thefederal.com/states/andhra-pradesh/telangana-poet-andesri-died-215446
[7]. https://www.telangana.gov.in/wp-content/uploads/2024/10/Telangana-State-Song.pdf